



సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

## నల్లాల సర్వేతో పెరిగిన వసూళ్లు

- 25 రోజుల్లో రూ.26 లక్షలు
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహి స్తున్న డోర్ టు డోర్ సర్వేతో నల్లా బిల్లుల వసూళ్లు గణనీయంగా పెరిగినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. 25 రోజులుగా నగరంలో చేపడుతున్న నల్లాల సర్వేతో 26 లక్షల రూపాయల బిల్లులు వసూలయ్యాయని చెప్పారు. 2016 స్థాయీ సంఘం తీర్మానం మేరకు అపార్టుమెంట్ల డిపాజిట్లు, చార్జీలు వసూలు చేస్తున్నామన్నారు. 10 ప్లాట్ల వరకు ఉన్న అపార్టుమెంట్లకు 3/4 ఇంచ్‌తో కనెక్షన్‌కు 1.25 లక్షల డిపాజిట్, 11 నుంచి 25 ప్లాట్ల వరకు ఒక ఇంచ్ కనెక్షన్‌కు 1.85 లక్షలు, 25 ప్లాట్ల కంటే ఎక్కువ ఉన్న అపార్టుమెంట్‌లకు ఒకటింపావు ఇంచ్ కనెక్షన్‌కు 2.7 లక్షలు, మీటరు లేని కుళాయిలకు ప్రతి ప్లాట్‌కు నెలకు 125 రూపాయల చొప్పున వసూలు చేయాలని తీర్మానించారని చెప్పారు. 2011 స్థాయీ సంఘం చేసిన తీర్మానం మే రకు 1/2 ఇంచ్ కనెక్షన్‌కు నెలకు 600, 3/4 ఇంచ్ కనెక్షన్‌కు 795, ఒక ఇంచ్ కనెక్షన్‌కు 900 రూపాయల నెలసరి బిల్లులను వసూలు చేయా లని తీర్మానించినట్లు తెలిపారు. మెయిన్ పైప్‌లైన్, డిస్ట్రిబ్యూషన్ లైన్ కనెక్షన్ ఉన్నవాటిని తొలగించడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసు కుంటామన్నారు. వాటర్ ట్యాక్స్ డిమాండ్ నోటీసుకు, చెల్లించిన రశీదులకు ఏమైనా వ్యత్యాస ముంటే సంబంధిత వార్డు కార్యాలయం లోగానీ, మున్సిపల్ కార్యాల యంలోగానీ అధికారులను కలిసి సరి చూసుకోవాలని సూచించారు. నల్లా కనెక్షన్‌కు సంబంధించిన ఎలాంటి రికార్డులు లేకపోతే ఆ కనెక్షన్‌ను అక్రమ కనెక్షన్‌గా గుర్తించి, రెండు వేల రూపాయల చార్జీలతో క్రమబద్ధీకరిస్తామన్నారు. చార్జీలను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ కోరారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి రూ. ఐదు కోట్లు

గంగాధర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :గంగాధర మండలంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నియోజకవర్గ ప్రజలు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# డీసీసీ అధ్యక్షుడిగా మేడిపల్లి సత్యం

- అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా అంజన్‌కుమార్
- నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను వరించింది. ఆయన పేరును అధ్యక్ష పదవికి ఖరారు చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ (అర్బన్ జిల్లా) అధ్యక్షుడిగా వైద్యుల అంజన్ కుమార్‌ను నియమించారు. వీలైన చోట ఎమ్మెల్యేలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమిస్తే పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే అవకాశ ముంటుందని భావించిన పార్టీ అధిష్ఠానం పలువురు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష పదవులు కట్టబెట్టింది. ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. ఆయన స్థానంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు పార్టీ జిల్లా బాధ్యతలను అప్పగించారు. మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నచోట అర్బన్ కమిటీలను ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉన్న కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ కార్పొరేషన్ (అర్బన్ జిల్లా) కమిటీ అధ్యక్షుడిగా టీపీసీసీ కార్యదర్శిగా ఉన్న వైద్యుల అంజన్‌కుమార్‌ను ఎంపిక చేసింది. వీరిద్దరి నియామకంతో ఎన్నో రోజులుగా జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న ఉత్కంఠతకు తెరవీడింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుకు నిరాశే మిగిలింది. ఆయనకు జిల్లా అధ్యక్ష పదవి లేకపోతే అర్బన్ జిల్లా అధ్యక్ష పదవి అయినా దక్కుతుందని పార్టీ వర్గాల్లో బలంగా ప్రచారం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులు ఉన్న నేపథ్యంలో వెలిచాలకే కాంగ్రెస్ పదవి దక్కుతుందని అందరూభావించినా ఆయనకు ఆ పదవి లభించలేదు.

**ఏఐసీసీ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ**

జిల్లాలకు కొత్త కమిటీలు వేయాలని భావించిన తర్వాత టీపీసీసీ ఇందుకోసం షెడ్యూల్‌ను ప్రకటించింది. షెడ్యూల్ మేరకు ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులుగా ఎవరైతే బాగుంటుందో అభిప్రాయసేకరణ చేసి దరఖాస్తులను స్వీకరించేందుకు విడివిడిగా పరిశీలకులను పంపించాయి. వారు నాలుగు రోజులపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేశారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం 32 మంది, అర్బన్ జిల్లా అధ్యక్ష పదవి కోసం 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి పేర్లే కాకుండా దరఖాస్తు చేసుకోని వారి గురించి కూడా పరిశీలకులు సమాచారం సేకరించారు. వారు తమ నివేదికను టీపీసీసీకి, ఏఐసీసీకి సమర్పించారు. పరిశీలకుల నివేదికలను పరిశీలించిన టీపీసీసీ ప్రతిపాదించిన అభ్యర్థులను షార్టులిస్ట్ చేసి వారు సూచించిన వారే కాకుండా ఇతరుల పేర్లను కూడా పరిశీలించి ఏఐసీసీకి తమ ప్రతిపాదనలను పంపించింది. ఏఐసీసీ పలుకోణాల్లో ఆలోచించి జిల్లా సారథులను ప్రకటించింది. అధిష్ఠానం ఆశీస్సులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లభించడంతో ఆయనను డీసీసీ అధ్యక్ష పదవి వరించింది.



మేడిపల్లి సత్యం



వైద్యుల అంజన్‌కుమార్

**విప్ పదవి ఆశించినా..**

మేడిపల్లి సత్యం మొదటి నుంచి అసెంబ్లీలో పార్టీ విప్ పదవిని ఆశిస్తూ వచ్చారు. అయితే ఆయనకు విప్ పదవి కాకుండా డీసీసీ అధ్యక్ష పదవి దక్కింది. డీసీసీ అధ్యక్ష పదవిలో ఆరు సంవత్సరాలుగా మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. ఆయన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. ప్రస్తుతం అదే సామాజిక వర్గానికి చెందిన సత్యంకు మళ్లీ ఆ పదవి దక్కింది. అర్బన్ జిల్లా అధ్య క్షుడిగా వైద్యుల అంజన్‌కుమార్ పేరే మొదటి నుంచి వినవచ్చింది. రాజేందర్‌రావుకు డీసీసీ పదవి దక్కక పోతే ఆయనను అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తారని మూడురోజులుగా ప్రచారం జరిగింది. అందుకు భిన్నంగా బీసీ సామాజికవర్గానికి చెందిన అంజన్‌కు

(మిగతా 8వ పేజీలో)

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ భవనాన్ని శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారు లకు మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలన్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలు చేయించుకున్నారా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేకంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. బీపీ, షుగర్‌తోపాటు అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్,శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రాష్ ప్రొఫెషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుకు నిరుద్యోగ క్రైస్తవ మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ (డాటా ప్రొ కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్) నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు జతచేయాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం రూం నం. 108, కలెక్టర్ కాంప్లెక్స్‌లో డిసెంబరు 10లోపు సమర్పించాలన్నారు. వివరాలకు 08782957085, 998 9_727382 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పోక్సో కేసుల్లో 60 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసుల్లో 60 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సీపీ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. నవంబరు నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశాన్ని కమిషనరేట్ కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 63 పోక్సో కేసులు దర్యాప్తులో ఉన్నాయని, ఇందులో 32 కేసుల్లో నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్లు దాఖలు కాలేదన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా 2,540 కేసులు దర్యాప్తు దశలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్, మహిళా పోలీస్ స్టేషన్, కొత్తపల్లి స్టేషన్లలో పరిమితికి మించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జాప్యం లేకుండా కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 7-10 గంటల వరకు, సాయంత్రం 4-7గంటల వరకు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలన్నారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. జమ్మికుంట ఫ్లైఓవర్, కొత్తపల్లి-జగిత్యాల రోడ్డులోని ప్రమాదకర ప్రాంతాల్లో రేడియం బోర్డులు, డివైడర్లు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రుల నుంచి అనస్తీషియా మందులు బయటకు తీసుకువచ్చి మత్తు కోసం వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల కేసుల్లో రికవరీ శాతం 42.77 శాతం మాత్రమే ఉందని, దీనిని మెరుగుపరచడానికి స్పెషల్ టీంలను ఏర్పాటు చేయాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన 6,242 ఫిర్యాదుల్లో రికవరీ శాతం 30 శాతం మాత్రమే ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొబైల్స్ రికవరీకి అత్యంత ప్రాధాన్య మివ్వాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం అందేలా చూడాలన్నారు. బాధితు లకు నోటీసులు ఇచ్చి ఆర్డీవో ఆఫీసులో దరఖాస్తు చేసుకునేలా సహకరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ భీంరావు (ఏఆర్), ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, మాధవి, శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వేణుగోపాల్, విజయకుమార్, వాసాల సతీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

## సేవా సైనికులు

- నేడు ఎన్‌సీసీ దినోత్సవం

7



# ఎక్కడున్నారో?

- ఆపరేషన్ కగార్‌తో కాకావికలమైన మావోయిస్టులు
- రోజుకో ప్రచారంతో ఆందోళనలో అజ్ఞాతంలో ఉన్నవారి కుటుంబ సభ్యులు
- మల్లోజులతోపాటు పలువురు లొంగుబాటు
- పలువురు ఎన్‌కౌంటర్లలో హతం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అడవుల్లో ఎక్కడ తుపాకుల శబ్దం వినిపించినా చాలు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వణికిపోతోంది. మావోయిస్టు పార్టీలో అగ్రనేతలుగా ఉన్న వారిలో ఎక్కువ మంది ఉమ్మడి జిల్లాకు చెందినవారే..దీంతో ఎక్కడ ఎన్ కౌంటర్ జరిగినా.. కరీంనగర్ ఉలిక్కి పడుతోంది. నాలు గైదు దశాబ్దాలుగా ఉన్న ఊరిని, కన్నవారిని, కట్టుకున్న వారిని వదిలిపెట్టి నమ్మిన సిద్ధాంతాల కోసం అడవిబాట పట్టిన తమ వారి ఆచూకీ తెలియక, వారు ఎలా ఉన్నారోనని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు చర్చించుకుం టున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన మావో యిస్టు పార్టీ అగ్రనేతలు, కేంద్రకమిటీ సభ్యులు కట్టా రాంచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డిలతోపాటు పలు వురు ఆపరేషన్ కగార్‌లో భాగంగా పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్, చంద్రన్న, మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇంకా కొందరు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**దేవ్‌జీ ఎక్కడ..?**

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా మారేడు మిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుపార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతి చెందాడు. మల్లారాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ లొంగుబాటు కోసం ప్రభుత్వంతో ప్రయత్నాలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కోరుట్లకు చెందిన దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వస్తు న్నారు. ఏపీ పోలీసులు అరెస్టు చేసిన దేవ్ జీ టీంలోని రక్షక దళ సభ్యులు ఉండడంతో.. దేవ్ జీ ఎక్కడున్నాడనే చర్చ మొదలైంది. దేవ్ జీ తప్పించుకున్నాడా లేక, పోలీసుల అదుపులో ఉన్నాడా అన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. తన సోదరుడిని కోర్టులో ప్రవేశ పెట్టాలని దేవ్ జీ అన్న, అతడి సోదరుడి కూతురు కోరుతున్నారు.

**మావోయిస్టు ఉద్యమంలో కీలకం 'గణపతి'**

సీపీఐ ఎంఎల్ మావోయిస్టు పార్టీ అగ్రనేత, ఉద్యమమే ఊపిరిగా ఇన్నాళ్లు పార్టీని నడిపిస్తున్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత, మాస్టర్ బ్రెయిన్ కీ మ్యాన్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు, అలియాస్ గణపతి ఎక్కడున్నారన్నది ఇప్పటికీ కేంద్ర నిఘా వర్గాలకు కూడా అంతు చిక్కడం లేదు. మావోయిస్టు పార్టీకి అధునాతమైన ఆయుధాలు విదేశాల నుంచి తెప్పించడంతో పాటు మావోయిస్టు పార్టీ కార్యకలాపాలను అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేయడంలో గణపతిది కీలకపాత్ర. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌కు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి నాలుగున్నర దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. జగిత్యాల జైత్ర యాత్రను ముందుండి నడిపించిన వారిలో ఆయన ఒకడు. రష్యా గోడల మీద ఇప్పటికీ జగిత్యాల జైత్రయాత్ర పేరు ఉందంటే.. గణపతి మాస్టర్ బ్రెయినే కారణంగా ఆ ఊరి ప్రజలు చెప్పుకుంటారు. పీపుల్స్ వార్‌తోపాటు సీపీఐ ఎంఎల్ గ్రూపులు వేర్వేరుగా విప్లవ ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రజల పక్షాన నిలిచాయి. 2004లో నక్సలైట్లు తమ పార్టీలను ఒకే గొడుగు కిందకు చేర్చి సీపీఐ ఎంఎల్ మావోయిస్టు పా ర్టీగా ఏర్పాటు చేశారు. అప్పటి పీపుల్స్ వార్ పార్టీకి ప్ర .దాన కార్యదర్శిగా కొనసాగుతున్న ముప్పాళ్ల లక్ష్మణ్ రావు, అలియాస్ గణపతి నూతనంగా ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీకి కూడా ప్రధాన కార్యదర్శిగా ఎన్నకయ్యారు. అప్పటి నుంచి ఆయన విప్లవోద్యమాన్ని వివిధ రాష్ట్రాలకు విస్తరించారు. అనారోగ్య కారణాల వల్ల గణపతి ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవడంతో ఆ పదవి నంబాల కేశవరావును వరించింది. ఇటీవల నంబాల ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

**లొంగుబాట్లు.. ఎన్‌కౌంటర్లు**

మావోయిస్టు పార్టీలో మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాకు చెందిన వారే కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ, మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ, పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, మల్లా రాజిరెడ్డి లియాస్ సంగ్రామ్, జగిత్యాల జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, కరీంనగర్ జిల్లాకు చెందిన నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యామ్, ఇటీవల మర ణించిన కడారి సత్యానారాయణరెడ్డి, కట్టారాంచంద్రారెడ్డి, ఇతర దళ సభ్యులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారే. మే నెలలో జరిగిన ఆపరేషన్ కగార్‌లో పార్టీ ప్రధాన కార్య దర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మర ణించారు. దీంతో ఆ పదవిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ నియమితుల య్యారు. మల్లోజుల వేణుగోపాల్ అలి యాస్ సోనూ సహా 70 మంది మావో యిస్టులు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎదుట లొంగిపోయారు. పు ల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్న హైదరాబాద్‌లో డీజీపీ ఎదుట లొంగిపోయారు. కొందరు లొంగి పోగా, ఇంకా కొందరు అడవుల బాటనే ఉండి పోరాట పంథాతో ముందుకు వెళుతూ ఎన్‌కౌంటర్లలో మరణిస్తున్నారు. మిగతా వారి ఆచూకీపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది.

**అగ్రనేతలందరూ ఉమ్మడి జిల్లావారే..**

సీపీఐ ఎంఎల్ మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు, పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజి రెడ్డి, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలి యాస్ దేవ్‌జీ, స్టేట్ కమిటీ సభ్యులు కంకణాల రాజిరెడ్డి, గంకిడి సత్యనారాయణరెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారని, గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు దేశంలోనే లేరని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆపరేషన్ ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ కకావికలం అవుతోంది.

## మహిళలకు రీస్క్రీనింగ్ పూర్తి చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ క్యాంపులో మహిళలకు రీ స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. నగరంలోని బుట్టి రాజారాం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఔట్ పేషంట్ రిజిస్టర్లతోపాటు ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ఏఎన్ఎంల వారీగా అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలు పని తీరును సమీక్షించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన బ్లూ, రెడ్ రిజిస్టర్లలో నమోదు చేసిన అధిక రక్తపోటు, షుగర్ వ్యాధి గ్రస్తుల వివరాల నమోదు, వారికి అందచేసిన మందుల వివిరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనజవేరియా, బిఆర్‌ఆర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

## తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ


చందు అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి, ఎస్సై గణేశ్

ముస్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన తనయుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో రూరల్‌సీఐ మొగిలి వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన పిట్టల దేవయ్య(60) ఇంట్లో ఒంటిపై గాయాలతో అనూమా నాస్పద స్థితిలో చనిపోయడని దేవయ్య తమ్ముడు పిట్టల లక్ష్మయ్య గత అగస్టు నెలలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టం, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ప్రకారం దేవయ్యను ఊపిరాడకుండా చేసి చంపినట్లుగా తేలడంతో మృతుడి కుమారుడు పిట్టల చందు(42)ను విచారించారు. దేవయ్య, చందులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం తన కొడుకు ఆరోగ్యం బాగాలేదని ఎకరం భూమిని తండ్రి దేవయ్య వద్దన్నా చందు అమ్మాడు. నాటి నుంచి చందుతో మాట్లాడకుండా పక్క ఇంట్లో కిరాయి తీసుకుని దేవయ్య నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు తాగి వచ్చి చందును, చందు తల్లిని ఎందుకు భూమి అమ్మారంటూ దేవయ్య గొడవకు దిగేవాడు. గత ఆగస్టు 10న రాత్రి బెల్టుషాపు ముందర తాగి గొడవ చేస్తుండగా, అక్కడికి వెళ్లి చందు వారించే యత్నం చేయగా దేవయ్య కిందపడిపోయాడు. తర్వాత దేవయ్యను చందు ఇంట్లోకి తీసుకువచ్చాడు. తాగిన ప్రతిసారి గొడవకు దిగుతున్నాడని తండ్రి దేవయ్యను చందు ఊపిరి ఆడకుంగా చేసి కుమారుడు హత్య చేశారు. తరువాత తండ్రి రూం వద్ద పడుకోబెట్టి తనకేం తెలియదన్నట్లు తెల్లవారి కూలి పనికి వెళ్లాడు. తెల్లావారి దేవయ్య తమ్ముడు లక్ష్మయ్య గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించగా కన్న కొడుకే హంతకుడని తేలింది. చందును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు ఖాసిం పాల్గొన్నారు.

# పంట మార్పిడి దిశగా అడుగులు


వరిపొలంలో సాగుచేసిన మొక్కజొన్న పంట


కొయ్య పద్ధతిలో విత్తనాలు నాటుతున్న రైతులు

- జీరోటిల్లేజి పద్ధతిలో పొలాల్లో కొయ్యమక్క సాగు
- పంటల్లో తెగుళ్ల తగ్గుదలకు అవకాశం
- ఆరుతడి పంటలతో ఆదాయం పెంపునకు చర్యలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రైతులు పంట మార్పిడి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో యాసంగి సీజన్ ఆరంభం అవటంతో వరిస్థానంలో మొక్కజొన్న పంట సాగుకు రైతులు మొగ్గు చూపు తున్నారు. మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో రైతులు నిర్భయంగా మొక్కజొన్నపంట సాగు వైపు దృష్టిని సారిస్తు న్నారు. దీనికి తోడు వరికి బదులుగా మక్క సాగు చేయడంతో నేలలో తెగుళ్లు తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉండడంతో రైతులు పంట మార్పిడిపై ఆసక్తిగా ముందుకు సాగుతున్నారు.

### సాగు రెట్టింపు అయ్యే అవకాశం..

జిల్లాలో యాసంగిలో అన్ని పంటల సాగు విసీర్ణం నాలుగున్నర లక్షల ఎకరాల వరకు ఉంటుం దని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తు న్నారు. ఇందులో భాగంగా గతంలో 35వేల ఎక రాల్లో సాగయ్యే మక్క సాగు ఇప్పుడు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తు న్నారు. వరి పండించిన పొలాల్లో దుక్కి దున్నకుం డానే జీరో టిల్లేజి పద్ధతిలో కొయ్యమక్క సాగుచేసి ఖర్చులు తగ్గించుకుంటున్నారు జిల్లా రైతులు. వరుస క్రమంలో తాళ్లు కట్టి, మక్కలను విత్తుతు న్నారు. తదనంతరం కలుపు నివారణకు గడ్డిమం దును పిచికారి చేస్తున్నారు.

### మొక్కజొన్న సాగుతో దిగుబడి అధికం..

వేసవికాలంలో ఉష్ణోగ్రతలు పెరగుతుండడం, వాతావరణ పరిస్థితులు సైతం అనుకూలంగా ఉండడంతో మొక్కజొన్న దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరకు మక్కలను కొనుగోలు చేయడంతో రైతులు సాగుకు మరింత ఆసక్తిని కనబరుస్తు న్నారు. మొక్కజొన్నను కోళ్లఫారాల్లో దాణాగా, పశు వుల ఫారాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో మక్కలకు డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

### పక్షులు, జంతువుల సమస్యతో ఆందోళన

వరికి ప్రత్యామ్నాయంగా సాగుచేస్తున్న మొక్క జొన్న పంటకు పక్షులు, జంతువుల సమస్య అధిక మయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ వాటి వల్ల ఎదు రయ్యే సమస్యలకు చెక్‌పెట్టే దిశగా రైతులు ప్రణా ళికతో ముందుకు సాగుతున్నారు. మొక్కజొన్న సాగు చేసే క్రమంలో పక్షులు, జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నా రు. కోతులు, అడవి పందులు గుంపుగా వచ్చి పంటను నాశనం చేసే ప్రమాదం ఉంది. దీంతో రై తులు ముందస్తుగానే పచ్చికంకి దశలోనే అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు.

**కొయ్యపద్ధతితో ఖర్చు ఆదా**

జున్ను కవిత, మహిళా రైతు, చల్‌గల్ గ్రామం



ప్రతీసారి ఒకే పంట సాగు చేయడం ద్వారా పంట దిగుబడి తగ్గే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆదాయం సైతం పడిపోతుంది. పంట మార్పిడి చేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో వానాకాలంలో వరి సాగుచేసి, యాసంగిలో మొక్కజొన్న వేస్తున్నారు. పొలం దున్నకుండా కొయ్య పద్ధతిలో విత్తడంతో కొంత ఖర్చు తగ్గుతుంది.

**పంట మార్పుతో లాభాలు అనేకం**

- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల



పంటల మార్పిడితో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. తద్వార లాభాలు ఆర్జించవచ్చు. జిల్లాలో మొక్కజొన్న సాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు పంట దిగుబడి పెరిగే అవకాశం ఉన్నందున ఈ విషయాన్ని గమనించిన రైతులు మొక్కజొన్న వైపు దృష్టి సారిస్తున్నారు.

## 87మంది మందుబాబులకు జరిమానా, జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 87మంది మందుబాబులకు జరిమానా, జైలుశిక్ష విధిస్తూ వేములవాడ జూనియర్ సివిల్‌జడ్జి జ్యోతిర్మయి శనివారం తీర్పుఇచ్చారు. ఇటీవల వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 87మంది మందుబాబులు పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపరి చామని టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీరిలో 20మందికి ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా, మూడురోజుల జైలు శిక్ష, ఒకరికి రూ.3వేల జరిమానా, మూడు రోజుల జైలుశిక్ష, మరొకరికి రూ.3500 జరిమానా, మూడురోజుల జైలుశిక్ష, ఇద్దరికి రూ.5వేల జరిమానా, అయిదు రోజుల జైలుశిక్ష విధించారు. మరో 61మందికి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా, మరో ఇద్దరికి రూ.3500జరిమానా విధించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందు బాబులకు సీఐ, ట్రాఫిక్ ఎస్ఐ రాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గ్రామం నుంచి మండలంలోని యామాపూర్‌కు ఇసుక తర లిస్తుండగా పట్టుకుని రూ.10 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

## శిశువు విక్రయం కేసులో 16మంది అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పసికందును విక్రయించడానికి యత్నించిన ముఠాను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు టౌన్ ఏసీపీ వెంకటస్వామి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన శీలం సాయిశ్రీ(22) అనే మహిళకు భర్తతో విబేధాలు వచ్చాయి. గర్భిణిగా ఉన్న ఆమె హైదరాబాద్‌కు రాగా స్నేహితులు అభినవ్, హీనా ఆశ్రయం కల్పించారు. ఈ నెల 14న సాయిశ్రీ గాంధీ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సాయిశ్రీ ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అభినవ్, హీనా.. బిడ్డను పోషించడం కష్టమని, ఎవరికైనా అమ్మితే డబ్బులు వస్తాయని నమ్మించారు. ఇందుకు సాయిశ్రీ ఒప్పుకోవడంతో, హీనా తనకు తెలిసిన పల్లవి, భవాని అనే మధ్యవర్తుల ద్వారా కరీంనగర్‌లో బేరం కుదుర్చుకున్నారు. ఐదు లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్న ముఠా, 20న కారులో (అశోక్ అనే డ్రైవర్‌తో) కరీంనగర్ చేరుకున్నారు. భవాని సూచన మేరకు నగరంలోని ఆర్య ఆసుపత్రి వద్దకు వెళ్లి బిడ్డను కొనుగోలుదారులకు చూపించారు. అక్కడ డబ్బుల విషయంలో గొడవ జరగడం, అనుమానాస్పదంగా వ్యవహరించడాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తం కావడంతో భయపడిన ముఠా అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించింది. కరీంనగర్ టూ టౌన్ పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి శిశువును రక్షించి, ఐదు లక్షల రూపాయలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శిశువు తల్లి సాయిశ్రీ, మధ్యవర్తులు హీనా, అభినవ్, భవాని, కారు డ్రైవర్ అశోక్ సహా 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ కేసులో 16 మంది నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సీఐ కె సృజన్‌రెడ్డి తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తే హత్య చేశాడని బంధువులు, గ్రామస్థుల ఆరోపణ


సుకృత(ఫైల్)

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాములపల్లికి చెందిన చింతకుంట్ల సుకృత(45) అనే వివాహిత కాలిన గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె భర్త మహిపాల్ రెడ్డి హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు, స్థానికులు, బంధువుల వివరాలప్రకారం.. చింతకుంట్ల మహిపాల్ రెడ్డికి సుకృత మొదటి భార్య. వారికి ఒక కూతురు జన్మించిన తరువాత కొన్ని రోజులకు సుకృతను మహిపాల్‌రెడ్డి దూరం పెడుతూ వచ్చాడు. కొంత కాలానికి ఇంకొక మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మహిపాల్‌రెడ్డి సుకృత మధ్య గొడవలు జరుగుతున్నాయి. పంచాయితీలు సైతం నిర్వహించారు. భూ పంపకాల విషయంలో విభేదాలు ఏర్పడి కేసులు కూడా పెట్టుకున్నారు. చివరకు గ్రామంలో పంచాయితీ నిర్వహించి మహిపాల్‌రెడ్డి వద్ద నుంచి సుకృతకు 20గుంటల భూమి ఇప్పించారు. సుకృత ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ మిగతా సమయంలో కూలీకి వెళ్తూ కూతురిని చదివించి వివాహం చేసింది. ఇప్పుడు ఇంటి వద్ద ఒక్కతే ఉంటోంది. తనకు ఇచ్చిన 20గుంటల భూమిని సుకృత వేరే వాళ్లకు కౌలుకు ఇచ్చింది. దీంతో మహిపాల్ రెడ్డి కౌలుకు పట్టిన వ్యక్తిని బెదిరించాడు. చేసేది లేక ఆమె వ్యవసాయం చేసుకుంటున్నది. ఈ క్రమంలో శనివారం సుకృత వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. అదే సమయంలో మహిపాల్ రెడ్డి అక్కడికి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం వేళలో తన వ్యవసాయ భూమిలో సుకృత కాలిన గాయాలతో మృతిచెంది పడిఉంది. పక్కన పెట్రోల్‌బాటిల్ ఉండడంతో భర్త మహిపాల్ రెడ్డి భూ కక్షతోనే హత్య చేశాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణలో పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.

## వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో ఒకరు విద్యార్థి కాగా మిగితా రెండు ఘటనల్లో ఒకరు యువకుడు, మరొకరు వృద్ధురాలు.. వివరాల్లోకి వెళితే..

### తండ్రి మరణం తట్టుకోలేక.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


అభిరాం(ఫైల్)

కోరుట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంద్ నగర్ చెందిన సాంబారి అభిరాం(17) అనే ఇంటర్‌విద్యార్థి శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాంబారి అభిరాం కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత సంవత్సరం అభిరాం తన అన్న ఆదిత్య, తండ్రి శ్యాంసుదర్‌తో కలిసి మల్లాపూర్ మండలం మొగిపలిపేటలోని గోదావరి నదిలో స్నానానికి వెళ్లారు. స్నానానికి వెళ్లిన తండ్రి పిల్లల ముందే గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. అప్పడినుంచి అభిరాం తండ్రి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

### పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం

శంకరపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అంబాలాపూర్‌లో పురుగుల మందు తాగి శనివారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంబాలాపూర్‌కు చెందిన వీరగోని నరేష్(35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ తండ్రి వీరగోని కొంరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

### ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌లో ఉసికె ఎల్లయ్య(62) శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులవివరాల ప్రకారం.. ఎల్లయ్య భార్య 3నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. వారి కొడుకు రాంనగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మానసిక ఆందోళనతో ఎల్లయ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టిప్పర్

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ శనివారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... గంగాధర మండలం ఓద్యారం గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బాలసంకుల గిరిధర్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెంకట్రావుపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద తాతేరావు భగత్ అనే డ్రైవర్ టిప్పర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గిరిధర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సోదరుడు లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ ఎత్తుకెళ్ళిన దొంగలు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ ఖాన్‌పేటలో బుర్ర కుమార స్వామి, ఆకుల రవి, గుర్రం రవి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. ఉదయం పొలం వద్దకు వచ్చి చూసే సరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కరెంటు పోల్‌నుంచి దొంగిలించి అందులో నుంచి కాపర్‌వైర్‌ను దొంగిలించినట్లు రైతులు తెలిపారు. ఈ విషయాన్ని మొగ్దుంపూర్ ఎఈకి ఎల్‌యం రాజుకు తెలిపారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగిలించిన వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీతో.. మరణ ధ్రువీకరణ పత్రం జారీ

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

బీర్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రంపై తన సంతకం ఫోర్జరీ చేశారని తుంగూర్ కార్యదర్శి కె మల్లికార్జున్ శనివారం బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో భీమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన యశోదరాజన్న 2022అక్టోబరు 5వ తేదీన ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజన్న మరణం గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదు కాలేదు. అయినా రికార్డులో నమోదైనట్లు సంతకం ఫోర్జరీ చేసి 2024జనవరి 28వ తేదీన కొల్వాయి మీ సేవాకేంద్రం ద్వారా సర్టిఫికెట్ జారీ చేశారు. విషయం తెలుసుకున్న కార్యదర్శి మల్లికార్జున్ మీ సేవ కేంద్రంపై బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

### లారీ డ్రైవర్‌పై కేసు నమోదు..

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వడ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ డ్రైవరు వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి విద్యుత్‌లైన్‌ను ధ్వంసం చేసిన సంఘటనలో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. కోరం గ్రామంలో ఈనెల 15వడ్లు లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ వినోద్ తిరాజ్ వాహనాన్ని జాగ్రత్తగా నడుపుతూ విద్యుత్‌లైన్‌ను తగిలించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఎల్‌టి లైన్ దెబ్బతిని మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దెబ్బతిన్న స్తంభాల విలువ సుమారు రూ.45000 రూపాయలు. సెస్ ఏఈ గడపక ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అంతర్రాష్ట్ర సైబర్ మోసగాడి అరెస్టు

● ఇన్‌స్టాగ్రామ్‌లో నిరుద్యోగుల వివరాలు సేకరించి దుబాయ్ పంపిస్తానని మోసం

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిరుద్యోగుల వివరాలను సేకరించి దుబాయ్ పంపిస్తానని మోసం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ ప్రాంతానికి చెందిన డానియల్ కెవిన్ ఎడ్విన్ అనే సైబర్ మోసగాడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సారంగాపూర్ మండలానికి చెందిన నవీన్ అనే నిరుద్యోగి వివరాలను డానయల్ కెవిన్ కెడ్విన్ సేకరించాడు. అనంతరం ఫోన్ చేసి దుబాయ్ పంపిస్తానని నవీన్‌ను నమ్మించాడు. దీంతో నవీన్ దుబాయ్ వెళ్లేందుకు డానియల్ కెవిన్ ఎడ్విన్‌కు బ్యాంక్ ద్వారా విడతలవారీగా 8,40,000 రూపాయలను పంపించాడు. ఎన్ని రోజులు గడిచినా ఉద్యోగం రాక పోవడంతో మోసపోయానని గ్రహించిన నవీన్ సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు రఘుచందర్, వెంకరటమణ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టారు. నిందితుడిని సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ శివారులో జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి శనివారం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాలకు చెందిన సుమారు ఐదుగురు వ్యక్తులను సైతం నిందితుడు మోసం చేశాడని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మొబైల్‌ఫోన్స్, క్రెడిట్‌కార్డు డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై గీత, పోలీసుసిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## మానేరులో నదిలో కుంగిన చెక్ డ్యామ్


గుంపుల మానేరులో కుంగిన చెక్ డ్యామ్

ఓదెల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంపుల మానేరు నదిలోని చెక్‌డ్యాం శుక్రవారం కుంగిపోయింది. మానేరు పరివాహక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, సాగునీటికి కొరత లేకుండా ఉండేందుకు 2023లో రూ.23.52కోట్ల వ్యయంతో చెక్‌డ్యామ్ నిర్మించారు. అప్పటినుంచి మానేరు వాగులో నీటి నిలువ ఉండడంతో పరిసరాల ప్రాంతాల్లో సాగు, తాగునీటి ఇబ్బందులు లేవు. అలాగే ఇక్కడి రామభద్ర ఆలయానికి వచ్చే భక్తులు కూడా వాగునీరు స్నానాలకు అను కూలంగా ఉండేది. శుక్రవారం రాత్రిడ్యాం కుంగి పోవడంతో చెక్‌డ్యాంలోని నీరంతా దిగువ పోయింది. కూలిపోయిందనే సమాచారం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చెక్ డ్యాం వద్దకు వెళ్లి పరిశీలించారు. పొత్కపల్లి పోలీసులతో పాటు ఇరిగేషన్ అధికారులు సంఘటన వద్దకు వచ్చి పరిశీలించారు. యాసంగి పంటకు సాగునీటి కొరతవచ్చే పరిస్థితులు ఉన్నాయని మానేరు పరివాహక గ్రామాలప్రజలు తెలిపారు. ఈ సంఘటనవల్ల గుంపులతోపాటు జమ్మికుంట మండలం తనుగుల గ్రామాలప్రజలకు ఇబ్బందులు కలగనున్నాయి. చెక్‌డ్యాం కుంగిపోవడంపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేస్తే తప్పనిజాలు బయటికి వచ్చే పరిస్థితులు కనబడడంలేదు. అయితే నాణ్యత లోపమా, ఇసుక మాఫియా లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా డిటో నేటర్లతో పేల్చివేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆర్టీసీ బస్సు ఆపలేదని మహిళ ఆగ్రహం

● 3 కిలోమీటర్ల దూరం ఓ వ్యక్తి బైక్‌పై వెళ్లి బస్సు అడ్డగింత ● డ్రైవర్‌తో వాగ్వాదం

● పోలీస్ స్టేషన్ ఎదుట గొడవ - ఇరువురిని శాంతింపజేసిన పోలీసులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆపలేదని ఓ మహిళ ఆగ్రహించింది. ఓ వ్యక్తి బైక్‌పై వెళ్లి మూడు కిలోమీటర్ల దూరం వెంబడించి బస్సును అడ్డుకుంది. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మహిళ, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన మహిళ సంతోషి సిరిసిల్ల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తోంది. సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వన్‌పల్లి నుంచి సిరిసిల్ల వైపు వెళుతోంది. మహిళ సంతోషి నిలబడిన చోట డ్రైవర్ బస్సును ఆపకుండా ముందుకు సాగాడు. దీంతో ఆగ్రహించిన మహిళ అక్కడే ఉన్న ఓ వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనంపై ఆర్టీసీ బస్సును మూడు కిలోమీటర్ల దూరం వరకు వెంబడించింది. వీర్నపల్లి గ్రామ శివారులో ఆర్టీసి బస్సును ఆమె అడ్డుకుంది. బస్సులోకి ఎక్కి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. బస్సు ఎందుకు ఆపలేదని మండిపడింది. డ్రైవర్, మహిళ గొడవకు దిగడాన్ని చూసిన ప్రయాణికులు నివ్వెరపోయారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొనడం వల్ల డ్రైవర్ బస్సును నేరుగా వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రైవర్, మహిళ సంతోషికి నచ్చజెప్పేందుకు యత్నించినా ఆమె వినిపించుకోలేదు. సదరు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. చివరికి ఇద్దరిని శాంతింపజేయడంతో సమస్య సద్దుమణిగింది.


గొడవకు దిగిన మహిళకు నచ్చజెపుతున్న ఎస్ఐ లక్ష్మణ్

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అంబారిపేట విద్యార్థిని



కప్ అందుకున్న శరణ్యతో ఫిజికల్ డైరెక్టర్

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లలో జరిగిన అండర్ 17 విభాగం ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో అంబారిపేట ఉన్నత పాఠశాలకు చెందిన చింత శరణ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శరణ్య పాల్గొంటుందని పీడీ చెప్పారు.

## ఆర్‌జీపీఆర్‌ఎస్ జాతీయ కన్వీనర్‌గా రాజేష్ కాశిపాక



రాజేష్ కాశిపాక

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌కు చెందిన రాజేష్ కాశిపాకను 'రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్'(ఆర్‌జీపీఆర్‌ఎస్) జాతీయ కన్వీనర్‌గా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. రాజేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా పనిచేసేందుకు తనకు అవకాశం కల్పించనందుకు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

# సేవా సైనికులు



- క్రమశిక్షణ, ఏకత.. ఎన్‌సీసీ నినాదం
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం



గాడ్ ఆఫ్ హానర్‌లో పాల్గొంటున్న ఎన్‌సీసీ కేడెట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖాకీ యూనిఫామ్‌తో సామాజిక సేవలో పాలుపంచుకుంటూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోంది జాతీయ యువ సైనిక దళం (నేషనల్ కేడెట్ కార్ప్స్). ఓర్పు, నేర్పు, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాతత్పరత, చెరగని చిరునవ్వు, గుండె నిండా ధైర్యం, ఆపదలో ఆపన్న హస్తం అందించే హృదయం.. ఇవన్నీ ఓ సైనికుడికి ఉండాల్సిన లక్షణాలు. ఈ సుగుణాల కలబోతే ఎన్‌సీసీ కెడెట్లు. క్రమశిక్షణ, ఏకత నినాదంతో 1948లో నెహ్రూ కలలకు రూపంగా ప్రారంభించిన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) చెందుతూ నేడు 22 లక్షల యువతకు శిక్షణ ఇస్తోంది. క్రమశిక్షణ, దేశభక్తి గల యువతను నిర్మించే గురుతర బాధ్యతను పోషిస్తున్నది. పాఠశాల బాలబాలికలకు, కళాశాలల యువతీ, యువకులకు నిరంతరం క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం గల రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్నది ఎన్‌సీసీ. ప్రతి సంవత్సరం నవంబరు నెలలో నాలుగో ఆదివారం రోజు ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహిస్తారు.



ఆర్‌డి పరేడ్‌లో పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల కేడెట్లు

### ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యం...

దేశంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించి, వారిని దేశం సేవకు సిద్ధం చేయడం ఎన్‌సీసీ ముఖ్య లక్ష్యం. ఎన్‌సీసీలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ అనే విభాగాలు ఉన్నాయి. ఇవి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణను అందిస్తాయి. ఎన్‌సీసీ నినాదం ఐక్యత, క్రమశిక్షణ. ఈ సంస్థ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎన్‌సీసీ కేడెట్లకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తారు.

### శిబిరాల నిర్వహణ.

శిక్షణలో భాగంగా బెటాలియన్ స్థాయి, ఎన్‌సీసీ గ్రూపు స్థాయి, డైరెక్టరేట్ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాల ద్వారా కేడెట్లకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడుతాయి. ఇవేకాకుండా రిపబ్లిక్ దినోత్సవ శిబిరం, జాతీయ సమైక్యత, తలసేన, అటాచ్‌మెంట్, ట్రెక్కింగ్, సంయుక్త వార్షిక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ సికింద్రాబాద్ కేంద్రంగా పని చేస్తుంది. ఇందులో తొమ్మిది గ్రూపులు ఉన్నాయి. నిజామాబాద్ కేంద్రంగా ఉన్న ఎన్‌సీసీ గ్రూపు పరిధిలో కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ బెటాలియన్లు ఉన్నాయి.

### జీవితంలో మరిచిపోలేనివి అనుభవం



- యు మనీషా, ఎన్‌సీసీ కేడెట్

ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా జీవితంలో మరిచిపోలేని ఎన్నో అనుభవాలను పొందాను. దేశంలో ని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరాల్లో పాల్గొన్నాను. సైనికులతో కలిసి సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించాను. సాహస శిబిరాల్లో పాల్గొన్నాను.

### సామాజిక సేవలో తృప్తి...

- డి మనూష, ఎన్‌సీసీ కేడెట్



ఎన్‌సీసీ శిక్షణ ఎంతో కఠినమైనది. కానీ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, రక్తదానాలు చేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్‌గా నాకంటూ ఓ గుర్తింపు లభించింది.

## గ్రామానికి రోడ్డు వేయాలని రాస్తారోకో



పొత్తూరు వంతెనపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామం వరకు బీటీ రోడ్డు వేయాలని కోరుతూ గ్రామస్థులు శనివారం రాస్తారోకో చేపట్టారు. గ్రామ సమీపంలోని వంతెన వద్దకు శనివారం చేరుకున్న గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుండ్లపల్లె నుంచి పొత్తూరు వరకు డబుల్‌రోడ్డు మంజూరైందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రెండు సంవత్సరాల కాలంలో గన్నేరువరం వరకు మాత్రమే రోడ్డు వేస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి పొత్తూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్నం అశ్వినిశ్రీనివాస్, నాయకులు గుంటి ఆంజనేయులు, బండారి మహేష్, రొండ్ల కరుణాకర్‌రెడ్డి, పట్నం మహేందర్, తోడేటి సతీష్, తిరుమల్, అభి ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

గంగాధర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండల మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గంగాధరలో మాట్లాడుతూ 23 నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న అండర్-17ఖోఖో పోటీలకు శ్రీహర్షిని, సాహితి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

## భీమేశ్వరాలయంలో వైభవంగా పల్లకీ సేవ



భీమేశ్వరాలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలో శనివారం పల్లకీ సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తుల మొక్కుబడి కోసం పల్లకీ సేవలను ప్రతి రోజు సాయంత్రం 6.30గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సేవల్లో భాగంగా భీమేశ్వరాలయంలో పార్వతీ, రాజరాజేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిసహిత అనంత పద్మనాభస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే భక్తులు రద్దీగా ఉండే ఆది, సోమవారం రోజుల్లో సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఈ పల్లకీ సేవలను వినియోగించుకునేందుకు ఏర్పా ట్లు చేశారు. ఈ సేవల్లో ఆలయ పర్య వేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అర్చ కులు, వేదపండితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిం చారు. వైజంక్షన్, ఘాట్‌రోడ్డు ప్రాంతంలో వాహనాల రద్దీ నెలకొంది.

### ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరిలో స్నానాలు చేసి ఆలయాలకు చేరుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించి పూజలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముత్యంపేట్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేయడం సిగ్గు చేటన్నారు. ఇక్కడి రైతులు వంద కిలోమీటర్ల దూరంలో కామారెడ్డి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తూ ఆర్థిక భారం, ప్రయాణ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తెరిపించే వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల రవాణా ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో పలు రాష్ట్రాల్లో మూతపడిన దాదాపు 200 షుగర్ ఫ్యాక్టరీలను తెరపించడం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేతకాని తనవల్లనే రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాస్తే మూతపడ్డ మూడు షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, రాష్ట్ర నాయకులు రఘు, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు దోనికెల నవీన్, పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివ్, బీజేపీ జిల్లా కార్యదర్శి వీసు రాజేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తుకారం గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేటి విజయ్, పట్టణ కార్యదర్శి బొడ్ల ఆనంద్, ఎర్ర రాజేందర్, చెట్లపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## యూనిటీ మార్చ్‌కి చిన్నపాపయ్యపల్లివాసి ఎంపిక



నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశమంతటా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌కు హుజూరాబాద్ మండలం చిన్న పాపయ్యపల్లికి చెందిన నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న యూనిటీ మార్చ్ నాగపూర్, ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ముగుస్తుందన్నారు. జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో పనిచేస్తున్న పీజీటీ ఇంగ్లీష్ టీచర్ వొల్లాల శ్రీనివాస్ శుక్రవారం 10వ తరగతి విద్యార్థి బదావత్ సంజీవ్(15)ను చితకబాదగా విద్యార్థి చేయి విరిగింది. ఈ మేరకు విద్యార్థి తండ్రి బదావత్ రాజె కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీచర్ శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, విద్యార్థి దండ్రి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రాహ్మనపల్లి లంబాడి తండాకు చెందిన విద్యార్థి బదావత్ సంజీవ్ 15 రోజుల క్రితం ఆరోగ్యం బాగా లేనందున ఇంటికి వెళ్లి చికిత్స అనంతరం ఈ నెల 19న తిరిగి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో చేరాడు. శుక్రవారం ఉదయం నోట్స్ ఎందుకు రాయలేదని టీచర్ శ్రీనివాస్ అడుగుతూ విద్యార్థిని స్టాఫ్‌రూంకు పిలిచి అక్కడ మరో ఇద్దరు టీచర్ల సమక్షంలోనే చెంపపై కొట్టాడు, అనంతరం ప్రిన్సిపల్ రూంకు విద్యార్థిని తీసుకువెళ్లి ప్రిన్సిపల్ వీర్ల మహేష్, అటెండర్ ఎండీ జావిద్ సమక్షంలో వీపుభాగంలో మోచేతితో కొట్టాడని, లంబాడోళ్లు చదవరురా అంటూ కొడుతుంటే అటెండర్ ఆపబోగా వినిపించుకోకుండా కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరో టీచర్ విద్యార్థిని ఆసుపత్రికి తీసుకువెళ్లి డాక్టర్‌కు చూపించగా కుడిభుజంలో ఫ్రాక్చర్ అయినట్లు వెల్లడైందని విద్యార్థి తండ్రి పోలీసులకు తెలిపాడు.

టీచర్ శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నా మని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## కూలీ మృతి

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లో నివాసం ఉంటున్న నక్క సతీష్(45) అనే కూలీ పనికి వెళ్లి కొత్తపల్లి మండలం బద్దిపెల్లిలో హటాత్తుగా మరణించాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఛాతిలో నొప్పి వస్తుందని స్థానికులతో అంటూ కిందపడిపోయి మృతి చెందాడని తెలిపారు. ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన నక్క సతీష్ విద్యానగర్‌లో భార్య పిల్లలతో కలిసి ఉంటుండగా భార్య ఒక హాస్టల్‌లో పని చేస్తుండగా మృతుడు కూలీగా పని చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## లేబర్‌కోడ్‌ల అమలుకు బీఎంఎస్ మద్దతు

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలును బీఎంఎస్ స్వాగతిస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవ్వుల సురేష్ అన్నారు. శనివారం నగరంలోని బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రంగానికి ఇది చారిత్రాతమకమైన రోజు అన్నారు. భారతదేశంలో ఇంత పెద్ద కార్మిక సవ రణ ఇదే మొదటిసారి అన్నారు. కోడ్ అమలు కారణంగా దేశ వ్యాప్తంగా కార్మిక వర్గానికి సామాజిక భద్రతతో పాటు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుల ప్రవణ్, నాయకులు నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు

మానకొండూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయి యోగాలో బంగారు పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన పురాణం దీపక్ పంజాబ్, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. తీట్ల హర్షిత్ బాలాజీ హిమాచల్ ప్రదేశ్, తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం విద్యార్థులను అభినందించారు. పీఈటీలు శివప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత

### వేగంగా విస్తరణ పనులు



వేములవాడ రాజన్న ఆలయంలో దక్షిణప్రాకారం వద్ద పనులు

వేములవాడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆలయ పాత కట్టడాలు తొలగించేశారు. ఇక ఆలయం చుట్టూ ఉన్న ప్రాకారం కూల్చివేత పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే ఆలయ దక్షిణం వైపు ఉన్న ప్రాకారాన్ని చెన్నై నుంచి తెప్పించిన భారీ హైడ్రాలిక్ రిగ్ మిషన్‌తో కూల్చివేస్తున్నారు. ప్రధాన రహదారిని భారీరేకులతో మూసివేసి ప్రాకారం కూల్చివేత పనులు కొనసాగిస్తున్నారు. కాగా, దక్షిణ ప్రాకారాన్ని పాత రహదారిని కలుపుకొని నిర్మించేందుకు అంచనా వేశారు. ఇందుకు ఆర్‌అండ్‌బీ, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు శనివారం మార్కింగ్ ఇచ్చారు. విస్తరణ వల్ల బ్రాహ్మణుల ఇళ్లు, దుకాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు ఆ ప్రాంతం వైపు ఉన్న ఇళ్ల యజమానులకు ఎలాంటి నోటీసులు జారీకాలేదు. ఇందుకు దుకాణాలు, ఇళ్ల యజమానుల్లో ఆందోళన నెలకొంది.

## శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం నీరు రావడం స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 947.590 టీఎంసీల నీరు వచ్చి చేరగా, 879.877 టీఎంసీలు దిగువకు వదిలారు.

# డిసెంబరులో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చాట్ల శ్రీధర్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 13, 14 తేదీల్లో కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షులు డాక్టర్ చాట్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మణ్ అన్నారు. శనివారం కరీంనగర్ ఐఎంఏ హాల్‌లో పలువురు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. గతంలో 2014 సంవత్సరంలో రాష్ట్ర స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, అధికారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి నీలం లక్ష్మణ్, కోశాధికారి కుడాల సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు పెంచాల కిషన్‌రావు, రాజిరెడ్డి, వెంకటేష్, మహేందర్, మన్సూర్, ప్రభాకర్, పద్మ, రాధా, అమర్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

గణేశ్‌నగర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీలకు 42 రిజర్వేషన్ల సాధన కోసం డిసెంబర్ 10,11,12,. నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. బొల్లం లింగమూర్తి పటేల్ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాకి బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ చేర్చాలని అన్నారు. భారతదేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన దేశంలో 63 శాతం ఉన్న బీసీ కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో బీసీ కులాల వారు తీవ్రంగా అణచివేతకు గురవుతున్నారు. దేశంలో బీసీలకు ఒక న్యాయం, ఇతర వర్గాలకు ఒక న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తౌటం సత్యం. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కాల్వ మధుబాబు ఉన్నారు.

# సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. అధికారులు శనివారం జాబితాలను ప్రకటించారు. కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి జనరల్ మహిళ, నల్లగుంట పల్లి ఎస్సీ జనరల్, ఇరుకుల్ల జనరల్, మందులపల్లి జనరల్ మహిళ, మొగ్దుంపూర్ ఎస్సీ మహిళ, చెర్లబూత్కూర్ జనరల్, తహెర్ కొండాపూర్ జనరల్, బహదూర్‌ఖాన్ పేట జనరల్ మహిళ, చామనపల్లి బీసీ జనరల్, దుబ్బపల్లి జనరల్, ఫకీర్ పేట బీసీ మహిళ, జూబ్లీనగర్ బీసీ జనరల్, ఎలబోతారం ఎస్సీ జనరల్, నగునూర్ బీసీ మహిళకు కేటాయించారు. వార్డుసభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించారు.

**గన్నేరువరం :** గన్నేరువరం బీసీ జనరల్, చాకలివానిపల్లి ఎస్సీ మహిళ, చీమలకుంటపల్లి బీసీ జనరల్, చొక్కారావుపల్లి జనరల్, గోపాల్‌పూర్ జనరల్ మహిళ, గుండ్లపల్లి ఎక్స్‌రోడ్ బీసీ మహిళ, గుండ్లపల్లి బీసీ మహిళ, గునుకుల కొండాపూర్ ఎస్సీ జనరల్, హన్మాజిపల్లి జనరల్, జంగపల్లి జనరల్ మహిళ, ఖాసింపేట ఎస్సీ జనరల్, మాధాపూర్ జనరల్, మైలారం ఎస్సీ మహిళ, పారువెల్ల జనరల్ మహిళ, పీచుపల్లి జనరల్, సాంబయపల్లి జనరల్ మహిళ, యాస్వాడ జనరల్ స్థానాలతోపాటు గ్రామాల వారీగా వార్డుల స్థానాలకు రిజర్వేషన్‌లను కేటాయించారు.

**ఇల్లందకుంట :** బోగంపాడు జనరల్ మహిళ, బూజూనూర్ జనరల్, చిన్నకోమటిపల్లి జనరల్, ఇల్లందకుంట ఎస్సీ జనరల్, గడ్డివానిపల్లె బీసీ జనరల్, కనగర్తి ఎస్సీ జనరల్, లక్ష్మాజీపల్లె బీసీ మహిళ, మల్లన్నపల్లె బీసీ జనరల్, మల్యాల బీసీ మహిళ, మర్రివానిపల్లె జనరల్, పాతర్లపల్లి జనరల్, రాచపల్లి జనరల్, సీతంపేట జనరల్ మహిళ, సిరిసేడు ఎస్సీ మహిళ, శ్రీరాములపల్లె జనరల్ మహిళ, టేకుర్తి బీసీ జనరల్, వాగోడ్డు రామన్నపల్లె జనరల్ మహిళ, వంతడుపుల జనరల్ మహిళకు కేటాయించారు.



రాజకీయ నాయకులతో సమావేశంలో అధికారులు

**తిమ్మాపూర్:** వచ్చునూర్, మహాత్మానగర్, మొగిలిపాలెం (బీసీ పురుషులు/ మహిళ), పర్లపల్లి, మన్నెంపల్లి, గొల్లపల్లి (బీసీ మహిళ),జూగుండ్ల, కొత్తపల్లి (ఎస్సీ మహిళ), రేణికుంట, నల్లగొండ, పొరండ్ల (ఎస్సీ పురుషులు/ మహిళ), ఇందిరానగర్ (ఎస్సీ, మహిళ),నేదునూర్, రామకృష్ణ కాలనీ, రాంహనుమన్ నగర్, మల్లాపూర్, నుస్తులాపూర్, పొలంపల్లి (జనరల్ మహిళ), మక్తపల్లి, నర్సింగాపూర్, తిమ్మాపూర్,బాలయ్యపల్లి,లక్ష్మిదేవిపల్లి (జనరల్,పురుషులు/ మహిళ).

**మానకొండూర్:** ఎస్సీ మహిళ- గట్టుదుద్దెనపల్లి, లలితాపూర్, లింగాపూర్, ఎస్సీ జనరల్- పచ్చునూర్, రాఘవాపూర్, వన్నారం, బీసీ మహిళ- చెంజర్ల, ఖాదర్‌గూడెం, ముంజంపల్లి, బంజేరుపల్లి, బీసీ జనరల్ - ఈదులగట్టెపల్లి, లక్ష్మీపూర్, మద్దికుంట, పోచంపల్లి, జనరల్ మహిళ-అన్నారం, కెల్లేడు, కొండపల్కల, మానకొండూర్, నిజాయితీ గూడెం, శంషాబాద్, ఊటూర్, జనరల్- దేవంపల్లి, గంగిపల్లి, జగ్గయ్యపల్లి, పెద్దూరుపల్లి, రంగపేట, శ్రీనివాస్‌నగర్, వేగురుపల్లి, వెల్ది.

**చిగురుమామిడి :** బొమ్మనపల్లి ఎస్సీ మహిళ, చిగురుమామిడి బీసీ మహిళ, గాగిరెడ్డిపల్లి జనరల్‌మహిళ, గునుకులపల్లి జనరల్, ఇందుర్తి బీసీ జనరల్, కొండాపూర్ జనరల్, లంబాడిపల్లి జనరల్, ముాది మాణిక్యం ఎస్సీ జనరల్, చిన్నముల్కనూర్ ఎస్సీ మహిళ, నవాబుపేట బీసీ మహిళ, ఓగులాపూర్ జనరల్ మహిళ, పీచుపల్లి జనరల్, రామంచ జనరల్, రేకొండ బీసీ జనరల్, సీతారాంపూర్ జనరల్ మహిళ, సుందరగిరి జనరల్ మహిళ, ఉల్లంపల్లి ఎస్సీ జనరల్.

**భగత్‌నగర్ :** కొత్తపల్లి మండలంలో ఆసిఫ్‌నగర్ జనరల్, బద్దిపల్లి ఎస్సీ జనరల్, ఎలగందల్ బీసీ జనరల్, కమాన్‌పూర్ బీసీ మహిళ, ఖాజీపూర్ జనరల్, నాగులమల్యాల జనరల్ మహిళకు కేటాయించారు. వీటితోపాటు వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు.

**వీణవంక :** వీణవంక, వల్బాపూర్, రామకృష్ణాపూర్ ఎస్సీ మహిళ, ఘన్ముకుల, పోతిరెడ్డిపల్లి, దేశాయిపల్లి ఎస్సీ జనరల్, బేతిగల్, ఎల్బాక, మల్లారెడ్డిపల్లి బీసీ మహిళ, బొంతుపల్లి, బ్రాహ్మణపల్లి, హిమ్మత్‌నగర్, నర్సింహులపల్లి బీసీ జనరల్, కోర్కల్, గంగారం, మల్లన్నపల్లి, రెడ్డిపల్లి, కనపర్తి జనరల్ మహిళ, చల్లూరు, ఇప్పలపల్లి, కొండపాక, లస్మక్కపల్లి,మామిడాలపల్లి, నర్సింగాపూర్,శ్రీరామలపేట, కిష్టంపేట జనరల్.

## డీసీసీ అధ్యక్షుడిగా మేడిపల్లి సత్యం

(5వ పేజీ తరువాయి)

మార్‌కే ఆ పదవి దక్కింది. ఇప్పటి వరకు ఈ పదవిలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయ నను సుడా చైర్మన్‌గా నియమించడంతో ఈసారి అవకాశం కల్పించలేదు. నరేందర్‌రెడ్డి కూడా డీసీసీ అధ్యక్ష పదవి కోసం తీవ్రంగానే ప్రయత్నించారు. ఆయ నకు సుడా చైర్మన్ పదవి ఉండడంతో పాటు ఎమ్మెల్యేకు జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే పార్టీకి కలిసి వస్తుందని అధిష్ఠానం ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. జిల్లా కేంద్రమైన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గడిచిన నాలుగు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే పదవిని దక్కించుకోలేక పోయింది. ఎంపీ పదవిదీ అదే పరిస్థితి. గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఖాతా కూడా తెరువలేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యేను నియమించి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ పూర్వ వైభవాన్ని సాధించాలని కాంగ్రెస్ అధి ష్టానం భావించి ఆ బాధ్యతలను మేడిపల్లి సత్యంకు కట్టబెట్టింది.

## అచీవర్స్‌లో బాలల దినోత్సవం



వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

గణేశ్‌నగర్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ముందుగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, వీ4సీ ఫౌండర్ కె.వేణుగోపాల్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు అంశాలపై విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### జాతీయ స్థాయి క్రీడలకు శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ విద్యార్థులు

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో షూటింగ్ విభాగంలో మంద లికిత్ రెడ్డి, స్వర్ణం, నక్క అజిత్ కుమార్, అనుపమ, వేదశ్రీ సిల్వర్ పతకాలు సాధించినట్లు చెప్పారు. స్విమింగ్‌లో శివరాం చరణ్, అథ్లెటిక్స్‌లో తబిత రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

### పుస్తక పఠనం జీవితాలను మార్చేస్తుంది : డీఈవో

చొప్పదండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం విద్యార్థుల జీవితాలను మార్చేస్తుందని డీఈవో మొండయ్య అన్నారు. శనివారం రాగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నలుమాసు లింగయ్య శివలక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమెటికల్ సెలబ్రేషన్స్‌లో మాట్లాడారు. అనంతరం ఆర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సమగ్ర శిక్ష క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం, ముత్తారం ఎంఈవో హరిప్రసాద్, ఎంఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), (డాటా సైన్స్), ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. వేడుకల్లో వాగేశ్వరి విద్యా సంస్థల జనరల్ సెక్రెటరీ గంద్రా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఆటాపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ జోనల్ క్రికెట్ పోటీలకు మానేరు విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మల్కాపూర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు జోనల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. అండర్-14 విభాగంలో జైనుల్లా, వినీష్ పటేల్ రాణించినట్లు తెలిపారు.శనివారం మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, విద్యాసంస్థల డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి అభినందించారు.

### విజన్ హైస్కూల్‌లో ఎల్లో కలర్ డే

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేకుర్తి విజన్ హైస్కూల్‌లో శనివారం ఎల్లో కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పసుపు రంగు దుస్తులతో రావడంతోపాటు బొమ్మలు, వస్తువులు తీసుకొచ్చి సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, డైరెక్టర్ సందవేణి వెంకట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులున్నారు.

### అంజయ్య వ్యాసాల పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఫిలింభవన్‌లో శనివారం రచయిత కందుకూరి అంజయ్య కవిత్వానుశీలనంలో భాగంగా కపిసా, అంబేద్కర్, పూలే, పెరియార్ అధ్యయన వేదిక, తెరసం సంయుక్త ఆధ్వర్యంలో అంజయ్య వ్యాసాల పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. సంపాదకుడు కూకట్ల తిరుతి పుస్తక పరిచయం చేశారు. సీనియర్ జర్నలిస్టు, రచయిత పిఎస్ రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, యాదగిరి శేఖరరావు, వొద్దమల్ల విజయభాస్కర్, అన్నవరం దేవేందర్, దామరకుంట శంకరయ్య కవులు, రచయితలు పాల్గొన్నారు.

### నేటి నుంచి దూర విద్య తరగతులు

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు దూర విద్య తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### సత్యసాయి శతజయంతి మహోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మూడు రోజులుగా కార్ఖానగడ్డ, సైన్స్‌వింగ్ కళాశాల ఎదుట సత్యసాయి సేవా సదనంలో శ్రీసత్యసాయి జయంతి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు శనివారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి లింగమూర్తి, కరీంనగర్ కమిటీ కన్వీనర్ హరికృష్ణ, లక్ష్మీపతి, కనకయ్య, కైలాసం, కోమల ఉన్నారు.

### కందుగుల ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాలు

హుజూరాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుగుల ప్రభుత్వ పాఠశాలలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి సరిత-జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం అభివృద్ధికి తమ స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. మాజీ ఎంపీటీసీ కాసం రఘుపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బెల్లి రాజయ్య, ఇమ్మడి దయాకర్ పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎండీ కాలనీలో అయ్యప్ప స్వామి దేవాలయ పుణ్యక్షేత్ర ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### హనుమాన్ ఆలయంలో ఉత్సవాలు

హుజూరాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి శివపంచాయతన పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం శనివారం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. ధ్వజస్తంభ, శిఖర యంత్ర ప్రతిష్ఠ, శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

### మానసాదేవిని దర్శించుకున్న విద్యారణ్య భారతీ స్వామి

గన్నేరువరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయాన్ని విద్యారణ్య భారతి స్వామి శనివారం సందర్శించారు. మానసాదేవి, శ్రీచక్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రవచనాలను వినిపించారు.

## ● సంక్షిప్తంగా..

**సైదాపూర్:** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సైదాపూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టతపై హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో వాసరచన పోటీలు నిర్వహించారు. జేఏసీ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

**గణేశ్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు సత్తా చాటాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సంఘం కార్యా లయంలో విలేకరులతో మాటా్లడారు. ప్రతీ మండలంలో పోటీకి సిద్ధం కావాలన్నారు.

**కరీంనగర్ రూరల్:** దుర్శేడ్ జిల్లాపరి షత్ స్కూల్ పదోతరగతి విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.

**కరీంనగర్ కల్చరల్:** నగర శివారులోని వేదభవనంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరు స్వామి ఆశీస్సులతో శనివారం సోలార్ సిస్టం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు.

**వీణవంక:** మండలంలోని కనపర్తిలో నిర్మిస్తున్న అభయంజానేయస్వామి, నాగదేవత ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా నిత్యహూజ స్థాపిత హోమాలు దేవత మహాభిషేకం నిర్వహించారు. అలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**సుభాష్‌నగర్:** జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నామని యదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య, సంబోయిన ప్రసాద్, బోయిని పోచమల్లు, శంకర్, పర్శరాములు తెలిపారు. శనివారం అడ్‌హక్ కమిటీకి సంబంధించి అధికారులు జారీ చేసిన పత్రాన్ని ప్రదర్శించారు. ఆ రోజు 12 మందిని చీఫ్ ప్రమోటర్లు, ప్రమోట ర్లను మాత్రమే ఎన్నుకున్నామన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని 60 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 15 లక్షల 6 వేల రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.

**వీణవంక:** మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన గిరవేన తిరుపతికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సహకారంతో రూ.17500 చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మందా అనిల్ రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం సురేందర్ రెడ్డి,దాసారపు గురువయ్య, కోమాల్ రెడ్డి తదితరులున్నారు.

## ‘షీ లీడ్స్’తో సత్ఫలితాలు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న ‘షీ లీడ్స్’ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు. కమిషనరేట్ కేంద్రంలో రెండు విడతల్లో 102 మంది మహిళా కానిస్టేబుళ్లు, షీ-టీమ్స్ సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను సమర్థవంతంగా రక్షించగలమన్నారు. కేవలం మాటల్లో కాకుండా చేతల్లో మేమున్నాం అనే భరోసాను కల్పించేలా మహిళా బ్లూ కోల్ట్స్ సిద్ధమయ్యారని సీపీ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, మాధవి, కరాటే మాస్టర్ వసంత్ కుమార్, ఇతర ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకం దారులకు అండగా నిలవండి

కరీంనగర్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా నూతన కమిటీ చైర్మన్, సభ్యులు గొర్రెల పెంపకం దారులకు వెన్నుదన్నుగా నిలవాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నూతన కమిటీ చైర్మన్ బాష వేణి మల్లేష్ యాదవ్‌తో పాటు సభ్యులు హైదరాబాద్‌లో వెలిచాల రాజేందర్‌రావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు అభినందనలు తెలిపారు. గొర్రెల పెంపకం దారుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు జిల్లాకు పెద్ద సంఖ్యలో అందేలా కృషి చేస్తానన్నారు.

## శ్రీచైతన్యలో ముగిసిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఫార్మసీలో జరుగుతున్న 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ముగింపు కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఔషధ రంగంలో వచ్చిన, రావల్సిన మార్పులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ నర్సింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం





ఇందిర మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్/శంకరపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హహిళల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య ఆవరణలో శనివారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక అబివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వాహణాధికారి పవన్‌కుమార్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బసవయ్యగౌడ్ పాల్గొన్నారు.

మహిళా ఉన్నతితోనే తెలంగాణ ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని రైతు వేదికలో శనివారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ చేపట్టారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జడ్పీసీఈవో పవన్‌కుమార్, డీఆర్డీవో పీడీ శ్రీధర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వరలక్ష్మీ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఓదెలు, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

**గంగాధర:** మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలో శనివారం ఇందిర మహిళా శక్తి చీరలు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో రాము, పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

**ఇల్లందకుంట/వీణవంక :** గడ్డివానిపల్లెలో, వీణవంక మండలం పోతిరెడ్డిపల్లిలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, లక్ష్మాజిపల్లెలో తహసీల్దార్ రాజమల్లు ఇందిరమ్మ చీరలను శనివారం పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, సతీష్ గౌడ్,మధుకర్,రామృష్ణ తదితరులున్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



వైద్యుల అంజన్‌కుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నియామకంపై శనివారం రాత్రి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇందిరాచౌక్‌లో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ నూతన అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, డైరెక్టర్, నాయకులు ప్రశాంత్ దీపక్, ఎస్ఏ మోసిన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు మునిగంటి అనిల్, పొన్నం మధు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

## సెల్లార్ల కమర్షియల్ వినియోగం నిబంధనలకు విరుద్ధం

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ సెల్లార్‌లను వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించుకోవాలని, కమర్షియల్‌గా వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. శనివారం నగరంలోని పలు అపార్టుమెంట్లను పరిశీలించారు. కమర్షియల్‌గా వినియోగిస్తున్నట్లు గుర్తించి 17 అపార్టుమెంట్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

### జిల్లాలో జాగృతి బలోపేతానికి కృషి

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాగృతిని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అన్ని మండల కమిటీల ఎన్నికల కోసం ఇన్‌చార్జిలను నియమించామన్నారు. చొప్పదండి ఇన్‌చార్జిగా రంగరవేణి లక్ష్మణ్, చిగురుమామిడి మేకల తిరుపతి, మానకొండూర్ కొత్తూరు రఘు, హుస్నేన్, వంగల వీరాచారి, రామడుగుకు అంకం శివాణి, సంగీతారెడ్డి, గంగాధర శ్రీరాముల రమేశ్, గర్శకుర్తి విద్యాసాగర్‌ను నియమించారు. గన్నేరువరం గాలిపల్లి రత్నాకర్, దుర్శేటి లక్ష్మన్, హుజురాబాద్ బుడిగె పర్శారాంగౌడ్, జమ్మికుంట పెండ్యాల మహేశ్, శంకరపట్నం చంటి శ్రీనివాస్, సైదాపూర్‌కు రాజ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, ఇల్లందకుంట సల్మా, పోతల రూప, బండ అశోక్, వీణవంక కుతాడి శ్రీనివాస్, కరీంనగర్‌కు అపర్ణ, రోజారెడ్డి, నౌశిన్, కొత్తపల్లికి రాజీ, పూసాల పవన్‌ను నియమించినట్లు ప్రకటించారు.

### ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని రాంచంద్రాపూర్ కాలనీలో కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఆర్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పిలుపు మేరకు గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ బాధ్యులు పాల్గొన్నారు.

**కరీంనగర్ కల్చరల్:** స్థానిక శ్రీపురంలో కార్యకర్తలు కరపత్రాలను పంపిణీ చేశారు. స్వదేశీ వస్తువులు వాడాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని, వాడకూడదని పిలుపునిచ్చారు.

### జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో వైరాగ్యంకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళామందిరం క్షేత్రంలో జిల్లాకు చెందిన వైరాగ్యం ప్రభాకర్‌ను సన్మానించారు. మల్లె తీగ సాహిత్యసేవా సంస్థవారు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని గంజ్ సర్కిల్‌లో నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత, అసంఘటిత కార్మికులు ఉద్యమించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సీఐటీయూ మండల నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు పాల్గొన్నారు.

**మానకొండూర్ :** మానకొండూర్‌లోని స్థానిక రైసుమిల్లుల లో పని చేసే కార్మికులు శనివారం లేబర్ కోడ్ కాపీలను దహనం చేశారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని నిరసన తెలిపారు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, రైసుమిల్ కార్మికులు పాల్గొన్నారు.

## భవనానికి నిధులు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా చైర్మన్ బాషవేణి మల్లేశం యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో చైర్మన్ మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం ఫొటో లేకుండానే చెక్కుల పంపిణీ ఎలా?



సమావేశంలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేకుండానే కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎలా పంపిణీ చేస్తారని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ప్రశ్నించారు. శనివారం హుజూ రాబాద్ పార్టీ కార్యాల యంలో విలేకరులతో మాట్లా డారు. సీఎం అంటే కౌశిక్‌రెడ్డికి భయమని, అందుకే ఫొటో లేకుండా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారని అన్నారు. బీజేపీ ఎంపీలైనా బండి సంజయ్, ఈటల రాజేందర్ ఒకరిపై ఒకరు మాట్లాడు కోకుండా హుజూరాబాద్ అభివృద్ధికి సహకరించాలన్నారు. స్థానికల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు.